1st Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 03 సంచిక : 156
శనివారం 13 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## భారత్‌పై దాడికి మీరు ఆయుధాలు అమ్మొచ్చా.. మేము రష్యా నుంచి చమురు కొనకూడదా..?



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 12)
పశ్చిమదేశాలకు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మరోసారి షాక్ ఇచ్చారు. రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలే.. భారత్ ప్రత్యర్థులకు ఆయుధాలను విక్రయించిన విషయాన్ని జైశంకర్ గుర్తుచేశారు. ఆ ఆయుధాలతో భారత్‌పై దాడులు జరుగుతున్నా యని మండిపడ్డారు. ఈసందర్భంగా మన దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు రష్యా చమురు కొనుగోలు చేయాలని అమెరికానే చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఫిన్లాండ్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన ▶మిగతా 2లో

## విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 12)
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లోని విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. విద్యార్థుల మానసిక స్థితిని గమనిస్తూ.. వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. పిల్లలకు విద్యతో పాటు నైతిక విలువలు కూడా బోధించాలన్నారు. వారికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గురుకులాల డీసీవోలు, ప్రిన్సిపాళ్లు, డీడీలకు గురువారం విజయవాడలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ▶మిగతా 2లో

## అమిత్ షా చెబుతున్న ఈ బియ్యం ప్రత్యేకత ఏంటి?



**ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీతో రక్తహీనతను నివారించవచ్చన్న అమిత్ షా**
**80 కోట్ల మందికి ఉచితంగా పోషకాలు నింపిన బియ్యం పంపిణీ**

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 12)
దేశంలో రక్తహీనత, పోషకాహార లోపాలను అరికట్టేందుకు ఫోర్టిఫైడ్ బియ్యం (పోషకాలతో కూడిన బియ్యం) పంపిణీ ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకం కింద 80 కోట్ల మందికి ఉచితంగా ▶మిగతా 2లో

# వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ ఇచ్చింది



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 12)
స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి.. ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమి నేతలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. " నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారు. ▶2లో

## ప్రజల తీర్పే చరిత్రను మార్చింది..

**ఏపీ పునర్నిర్మాణానికి కూటమి కట్టుబడి ఉంది**
**ప్రజాస్వామ్యంలో తుది నిర్ణేతలు ప్రజలేనన్న పవన్**
**రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కూటమి ఏర్పడిందని స్పష్టీకరణ**
**ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి**
**విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకున్నామని వ్యాఖ్య**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 12)
ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని, వారి తీర్పును మించిన శక్తి ఏదీ లేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు కేవలం ప్రభుత్వ మార్పునకు మాత్రమే పరిమితం కాలేదని, రాష్ట్ర భవిష్యత్తుకు కొత్త దిశను నిర్దేశించిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతి సమీపంలోని దామినేడులో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం.. ▶మిగతా 2లో

## 'ఉక్కు' భూముల్లో ప్లాట్లు వేసి అమ్మేయాలని లేఖ రాయలేదా జగన్?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 12)
విశాఖ ఉక్కు కర్మాగారానికి చెందిన వేల ఎకరాల్లో ప్లాట్లు వేసి అమ్మేయాలని గతంలో కేంద్ర ప్రభుత్వానికి జగన్ రెండు లేఖలు రాశారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. అలా వచ్చిన డబ్బుతో స్టీల్‌ప్లాంటును బలోపేతం చేయాలంటూ తప్పుడు ప్రతిపాదనల్ని కేంద్రం ముందుంచారని మండిపడ్డారు. తాజాగా ఆ లేఖల్ని చూపుతూ తానేదో ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను ఆపానంటూ జగన్ అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పట్టాభిరామ్ గురువారం విలేకరులతో మాట్లాడారు. 'విజయనగరం జిల్లాలో ఉక్కు కర్మాగారానికి ఉన్న మాంగనీస్, సిలికా గనుల లీజుల్ని పొడిగించకుండా అప్పట్లో జగన్ తొక్కిపెట్టారు. వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని కుట్ర పన్నారు. దీంతో ఉక్కు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్లాంటు నిర్వహణే ప్రశ్నార్థకమైంది. అప్పట్లో ఈ అంశాన్ని కార్మిక సంఘాలు జగన్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన కనీసం స్పందించలేదు' అని పట్టాభిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ లీజుల్ని పొడిగించి...ఉక్కు కర్మాగారాన్ని నిలబెట్టిందని తెలిపారు.

**వైకాపా ప్రభుత్వంలో 2,200 మంది ఉద్యోగులు తగ్గారు...**

వైకాపా హయాంలో విశాఖ ఉక్కు కర్మాగారంలో 2,200 మంది ఉద్యోగులు తగ్గారని పట్టాభిరామ్ ఆరోపించారు. ▶మిగతా 2లో

# జగన్ పేరులో 'జీ' అంటే 'జెన్ జీ' కాదు..
## గొడ్డలి.. విధ్వంసమే ఆయన ఎజెండా



**రూ. లక్ష కోట్లతో 'మిషన్ రాయలసీమ' ప్రాజెక్టును ప్రారంభిస్తామన్న మంత్రి**
**జగన్‌కు క్రెడిట్ చోరీ డిజార్డర్ (సీసీడీ) అనే జబ్బు ఉందంటూ సెటైర్లు**
**చిన్నప్పుడు టీచర్లు కొట్టారనే కోపంతోనే జగన్ డీఎస్సీపై పగబట్టారని ఎద్దేవా**
**ప్రజాప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో దాడులు, కబ్జాలు, హత్యలు లేవన్న లోకేశ్**
**డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్‌తో ఏపీలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్న మంత్రి**


(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 12)
రాయలసీమను 'రాయల్ సీమ'గా మార్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకోసం రూ.లక్ష కోట్ల భారీ బడ్జెట్‌తో 'మిషన్ రాయలసీమ' ప్రాజెక్టును చేపట్టబోతున్నామని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఈ ప్రాజెక్టు దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్ష నేత జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌కు సీసీడీ జబ్బుంది.. జీ అంటే గొడ్డలి ప్రతిపక్ష నేత జగన్‌కు 'సీసీడీ' (క్రెడిట్ చోరీ డిజార్డర్) అనే జబ్బు ఉందని లోకేశ్ ఎద్దేవా చేశారు. తాము కష్టపడి గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి కంపెనీలను రాష్ట్రానికి తీసుకొస్తే, వాటిని తానే తెచ్చానని ప్రెస్‌మీట్ పెట్టి ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ▶మిగతా 2లో

## రాజ్యసభ సీటుపై మీకెందుకు అసహనం?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 12)
రాజ్యసభ సీటు మాట ఇచ్చిన వాళ్లకు, మాట తీసుకున్న వాళ్లకు సంబంధించిన విషయమని, మధ్యలో మీ అసహనం ఏమిటని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల భాజపా నేతలను ప్రశ్నించారు. 12 ఏళ్ల ఎన్డీయే వైఫల్యాలను ప్రజల ముందు పెడితే సమాధానం చెప్పలేక, అర్థం లేని అంశాలను మాట్లాడే భాజపా నేతల సంస్కారం ఏపాటిదో అర్థమవుతుందని ఆమె పేర్కొన్నారు. భాజపా నేతల విమర్శలపై ఎక్స్ వేదికగా షర్మిల గురువారం స్పందించారు. 'భాజపాకు చిత్తశుద్ధి ఉంటే పుండు మీద కారం చల్లే చేష్టలు పక్కన పెట్టి రాష్ట్ర కాంగ్రెస్ తరపున లేవనెత్తిన కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై సమాధానం చెప్పాలి. నిత్యావసర ▶మిగతా 2లో

## ఇరాన్‌తో డీల్ కోసం.. 'యురేనియం'పై మెట్టు దిగిన ట్రంప్..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 12)
ఇరాన్‌తో డీల్ దాదాపు కొలిక్కివచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. గతంలో కూడా ఆయన పలుమార్లు ఇలాంటి ప్రకటనలు చేసినప్పటికీ.. ఈసారి మాత్రం ఒప్పందం ఖరారయ్యే సంకేతాలే కన్పిస్తున్నాయి. ఇందుకోసం ట్రంప్ ఓ మెట్టు దిగి మరీ ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈమేరకు అమెరికా విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా సంస్థ సంచలన కథనం వెల్లడించింది.
**'యురేనియం'పై తగ్గి..** ఇరాన్‌లో శుద్ధి చేసిన యురేనియం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ దేశం చేతుల్లో ఉండొద్దని ట్రంప్ గత కొంతకాలంగా డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. ▶మిగతా 2లో

## తూనికలు, కొలతల శాఖలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 12)
తనిఖీలు, కేసులతోనే సరిపెట్టకుండా.. నకిలీలు, కొలతల్లో తేడాల్ని వేగంగా గుర్తించే సాంకేతికతను తూనికలు, కొలతలశాఖ అందిపుచ్చుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. ఇక్కడ ఇంకా పాత విధానాలే కన్పిస్తున్నాయని, దీన్ని అధిగమించేలా కొత్త విధానాలు, ఆవిష్కరణలు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో తూనికలు, కొలతలశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. 'ఆహార పదార్థాల కల్తీ, నకిలీలు తదితరాలపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే అంశాలపై వేగంగా స్పందించాలి. వెంటనే రంగంలోకి దిగితేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. న్యాయపరంగా ఇబ్బందులు ▶మిగతా 2లో

# వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ ఇచ్చింది

ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు.. రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చాం. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి.. శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతాం. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు బహిర్గతమే. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ భరోసా.. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం. గిట్టుబాటు ధర లేకపోతే రైతులను ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తున్నాం. ఓటమి ఎరుగని నాయకుడు నరేంద్రమోదీ. గుజరాత్, ఢిల్లీలో మోదీ అనేక కార్యక్రమాలు చేయగలిగారు. 12 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధివైపు దూసుకెళ్లింది" అని సీఎం అన్నారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ప్రజల తీర్పే చరిత్రను మార్చింది..

అభివృద్ధి, సంక్షేమం' బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చారిత్రక విజయానికి కారణమైన ప్రజలకు, కూటమి శ్రేణులకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు."రెండేళ్ల క్రితం ప్రజలు మాకు కేవలం అధికారాన్ని ఇవ్వలేదు.. ఒక పెద్ద బాధ్యతను అప్పగించారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితం. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం కూటమి ఏర్పడింది. అధికారాన్ని పంచుకోవడం కోసం కాదు.. బాధ్యతను పంచుకోవడం కోసం ఈ కూటమి ముందుకొచ్చింది" అని పవన్ అన్నారు. జనసేన కేవలం 21 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ, ప్రజల ఆశీర్వాదంతో అన్ని స్థానాల్లో విజయం సాధించడం తమపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధికి కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ఎన్డీయే ప్రభుత్వ సమష్టి కృషి వల్ల విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోగలిగామని తెలిపారు. దేశంలో అత్యధిక కాలం నిరంతరాయంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నరేంద్ర మోదీకి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

ఇటీవల జరిగిన విశాఖ స్టీల్ ప్రమాదంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమని పవన్ పేర్కొన్నారు. ఆ దుర్ఘటన కారణంగానే ఈ నెల 9న జరగాల్సిన కార్యక్రమాన్ని వాయిదా వేసి ఇప్పుడు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

# జగన్ పేరులో 'జీ' అంటే 'జెన్ జీ' కాదు..

"ఇంకొంత కాలం సమయం ఇస్తే, ఆగస్టు 15న ప్రెస్‌మీట్ పెట్టి భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది మా తాతేనని ప్రకటించినా ఆశ్చర్యపోనక్కర్లేదు" అని లోకేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ తెచ్చిన కంపెనీలు కేవలం ఆంధ్రా గోల్డ్, ప్రెసిడెంట్ మెడల్, గోల్డ్ మెడల్ వంటి మద్యం బ్రాండ్లు మాత్రమేనని ఆరోపించారు. "జగన్ పేరులో ఉన్న 'జీ' అంటే జెన్-జీ అనుకుంటున్నారు. కానీ, ఆ జీకి అసలు అర్థం 'గొడ్డలి'. విధ్వంసమే ఆయన ఎజెండా" అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. తమది గూగుల్ అయితే వాళ్లది గొడ్డలని, తమది ఫైటర్ జెట్స్ అయితే వాళ్లది ఫ్యాక్షన్ అని, తమది కియా అయితే వాళ్లది కిడ్నాప్ అని పోల్చారు.

### రెండేళ్ల పాలనలో ప్రశాంతత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొందని లోకేశ్ అన్నారు. గతంలో మాదిరిగా దాడులు, జేసీబీలతో కూల్చివేతలు, కబ్జాలు, హత్యలు, బెదిరింపులు లేవని చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే చంద్రగిరి గడ్డపై చెప్పాను. వెంకన్నతో పెట్టుకోవద్దు, మాడి మసైపోతావని జగన్‌ను హెచ్చరించాను. ఆయన వినకుండా స్వామితోనే పెట్టుకున్నారు, ఫలితం 2024లో చూశారు" అని గుర్తుచేశారు. వై నాట్ 175 అన్నవారికి ప్రజలు 11 సీట్లు ఇచ్చారని, సిద్ధం అన్నవారికి ప్రజలు యుద్ధం ప్రకటించారని అన్నారు.

### డీఎస్సీపై జగన్ విమర్శలు.. రాజ్యాంగంపై దాడి

చిన్నప్పుడు పదో తరగతి పేపర్ లీక్ కేసులో దొరికినప్పుడు టీచర్లు కొట్టారనే కోపంతోనే జగన్ ఉపాధ్యాయులపై కక్షగట్టారని లోకేశ్ ఆరోపించారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టిన చరిత్ర జగన్‌దని విమర్శించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి 226 కేసులు వేశారని, అయినా 150 రోజుల్లో 16,347 పోస్టులను భర్తీ

## మొదటిపేజీ తరువాయి

చేశామని తెలిపారు. ఇప్పుడు డీఎస్సీపై జగన్ చేస్తున్న ఆరోపణలు తనపైనో, ప్రభుత్వంపైనో కాదని, నేరుగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను ప్రశ్నించడమేనని అన్నారు.

### అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. పెన్షన్‌ను రూ.2000 నుంచి ఒకేసారి రూ.4000కు పెంచామని, అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభించామని, 16,347 డీఎస్సీ పోస్టులతో పాటు 6,000 కానిస్టేబుల్ పోస్టులు, జాబ్ క్యాలెండర్ ద్వారా మరో 10,060 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని వివరించారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం, 'దీపం-2' కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాలతో జనరంజక పాలన అందిస్తున్నామన్నారు.

### డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వల్లే ప్రపంచంలో భారత్‌కు గౌరవం పెరిగిందని లోకేశ్ అన్నారు. ఏపీలో ఉన్నది సాధారణ డబుల్ ఇంజన్ సర్కార్ కాదని, ఇది 'డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్' అని అభివర్ణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు, ఫైటర్ జెట్ ప్రాజెక్టు వంటివి సాకారమయ్యాయని తెలిపారు. త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అహంకారానికి పోకుండా, ఒకే కుటుంబంలా కలిసి పనిచేయాలని, ప్రజలకు చేసిన మంచి పనులను వివరించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

మంత్రి మాట్లాడారు. 'పేదలు విద్య ద్వారా సాధికారత సాధించాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పం. కార్పొరేటు స్కూళ్లకు దీటుగా గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలను తీర్చిదిద్దుతున్నాం. పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలి. జేఈఈ, నీట్‌లో ఎక్కువ మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించేలా బోధన సాగించాలి. వసతి గృహాల్లో సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, మెకనైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేశాం. పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో 100 శాతం సంతృప్తి రావాలి' అని వెల్లడించారు.

# అమిత్ షా చెబుతున్న ఈ బియ్యం ప్రత్యేకత ఏంటి?

ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాను 2028 డిసెంబర్ వరకు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. ఈ నిర్ణయం వల్ల కోట్లాది మంది లబ్ధిదారుల ఆరోగ్యం స్థితిగతులు మెరుగుపడతాయని ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు.

**ఏమిటీ ఫోర్టిఫైడ్ బియ్యం?** ఫోర్టిఫైడ్ బియ్యం అంటే ప్రత్యేకమైన వంగడం ఏమీ కాదు. మనం రోజూ తినే సాధారణ బియ్యానికే ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి కీలక సూక్ష్మ పోషకాలను జోడిస్తారు. ఈ ప్రక్రియలో బియ్యం గింజలపై పోషకాల పూత పూయడం లేదా పోషకాలతో కూడిన గింజలను సాధారణ బియ్యంలో కలపడం జరుగుతుంది. ఈ బియ్యం రుచి, వాసన, రంగులో సాధారణ బియ్యంలాగే ఉంటాయి. వండినప్పుడు కూడా ఎలాంటి తేడా ఉండదు.

### ఎందుకింత ప్రాధాన్యం?

భారత్‌లో మహిళలు, పిల్లలతో సహా అన్ని వయసుల వారిలో ఐరన్ లోపం వల్ల కలిగే రక్తహీనత (అనీమియా) తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) గణాంకాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశంలో చాలా మందికి అన్నమే ప్రధాన ఆహారం. ఇడ్లీ, దోశ, పులావ్, కిచిడీ వంటి ఎన్నో రకాలుగా బియ్యాన్ని ఉపయోగిస్తారు. అందుకే, ప్రజల ఆహారపు అలవాట్లను మార్చకుండా, వారి రోజువారీ భోజనం ద్వారానే పోషకాలను అందించేందుకు ఫోర్టిఫికేషన్ ఒక సులభమైన, సమర్థవంతమైన మార్గమని నిపుణులు చెబుతున్నారు. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు ?17,082 కోట్లు కేటాయించింది.

# భారత్‌పై దాడికి మీరు ఆయుధాలు అమ్మొచ్చా.. మేము రష్యా నుంచి చమురు కొనకూడదా..?

దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. "భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్ప గలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదు" అని పేర్కొన్నారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. "ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం" అని మంత్రి వెల్లడించారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

# 'ఉక్కు' భూముల్లో ప్లాట్లు వేసి అమ్మేయాలని లేఖ రాయలేదా జగన్?

పార్లమెంట్ సాక్షిగా అప్పటి కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి ఈ వివరాలు తెలిపారన్నారు. '2020లో 17 వేల మంది ఉద్యోగులు ఉంటే 2023 నాటికి సుమారు 14,800కు తగ్గారు. ఉత్పత్తి సామర్థ్యం 25 శాతం మేర పడిపోయింది' అని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్లాంటు సామర్థ్యం 90 శాతానికి పెరిగిందని..రూ.54 కోట్ల మేర లాభాలు నమోదు చేసిందని పట్టాభిరామ్ వివరించారు.

# ఇరాన్‌తో డీల్ కోసం.. 'యురేనియం'పై మెట్టు దిగిన ట్రంప్..

దాన్ని అమెరికాకు అప్పగించాలని లేదంటే నాశనం చేయాలని ఆయన అంతకుముందు చెప్పారు. అయితే, తాజా చర్చల్లో దీనిపై ట్రంప్ కాస్త తగ్గినట్లు తెలుస్తోంది. శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్‌లోనే ఉంచేందుకు ఆయన అంగీకరించినట్లు సమాచారం. అయితే, అది ఐరాస ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలోనే ఉండాలని మెలిక పెట్టారట. ఇక, అణు కార్యక్రమాలపై టెహ్రాన్ ఎలాంటి చర్యలు చేపట్టాలన్నా.. అది అమెరికాతో రెండో డీల్ కుదిరిన తర్వాతేనని ట్రంప్ షరతు విధించినట్లు తెలుస్తోంది.

### డీల్ ప్రతిపాదనలు ఇవేనా..?

తాజా అవగాహన ఒప్పందంలో భాగంగా 30 రోజుల్లోపు హర్మూజ్ జలసంధి (స్ట్రెయిట్ ఆఫ్ హార్మూజ్)ని ఎలాంటి టోల్ రుసుములు లేకుండా నౌకల రవాణాకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనికి ప్రతిగా.. అమెరికా ఈ జలమార్గంలో నిర్బంధాన్ని ఎత్తివేయనుంది. ఇక, హర్మూజ్‌ను తెరిచిన తర్వాత 60 రోజుల పాటు ఇరాన్‌కు అగ్రరాజ్యం ఆంక్షల మినహాయింపు కల్పించనుందని తెలుస్తోంది. అంటే టెహ్రాన్ చమురు విక్రయాలు చేపట్టేందుకు అనుమతులివ్వనుంది. ఆ తర్వాత ఇరాన్ ప్రవర్తనను బట్టి ఈ మినహాయింపులను మరికొన్ని రోజులు పొడిగించే అంశాన్ని కూడా అమెరికా పరిశీలించనుంది.

**నెతన్యాహు ఊసే లేదు..** కాగా.. ఒప్పందంపై ఈసారి చర్చలకు సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఎలాంటి ముందస్తు సమాచారం లేదని సదరు కథనం పేర్కొంది. ఇరాన్‌తో డీల్ విషయంలో ట్రంప్.. ఆయనను దూరం పెట్టినట్లు సమాచారం. దీంతో అమెరికా మిత్రపక్షాలకు ఫోన్ చేసి నెతన్యాహు సమాచారం సేకరించారని అగ్రరాజ్య విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, అవగాహన ఒప్పందం కుదిరిన తర్వాత ట్రంప్.. నెతన్యాహుకు ఫోన్ చేసి విషయం చెప్పారు.

**ఐరోపాలో డీల్..** ఇరాన్-అమెరికా మధ్య ఈసారి డీల్ జెనీవాలో జరగనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దీనిపై సంతకాలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే పర్యటన ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయట. అమెరికాకు చెందిన నాలుగు ఎయిర్‌ఫోర్స్ సీ-17 విమానాలు ఇప్పటికే యూరప్‌కు బయల్దేరాయి. ఇందులో వాన్స్ పర్యటనకు అవసరమైన వాహనాలు, ఇతర పరికరాలను తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ వారాంతంలోగా డీల్ కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. యూఏఈ, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్ అధికారుల మధ్య బుధవారం రాత్రి కొన్ని గంటల పాటు చర్చలు జరిపాయి. ఇందులో ఒప్పందంపై ఇరుదేశాలు ఓ అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ట్రంప్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తమ ప్రతిపాదనలను ఇరాన్ అంగీకరించిందని, ఇక సంతకాలే తరువాయి అని ఆయన వెల్లడించారు. అయితే దీనిపై ఇరాన్ మాత్రం అధికారిక ప్రకటనేదీ చేయలేదు. ఈ ఒప్పందంలోని అంశాలను టెహ్రాన్ ప్రతినిధులు కూడా సమ్మతించారని సమాచారం. అయితే దీనికి సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ అంగీకరిస్తారా? లేదా అనే దానిపై స్పష్టత లేదు.


# రాజ్యసభ సీటుపై మీకెందుకు అసహనం?

ధరలు 300% ఎందుకు పెరిగాయో చర్చకు రావాలి. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారో సమాధానం చెప్పాలి. రూపాయి విలువ రెండింతలు ఎందుకు పతనం అయ్యిందో వివరణ ఇవ్వాలి' అని విమర్శించారు.

# తూనికలు, కొలతల శాఖలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

రాకుండా శాస్త్రీయ పద్ధతిలో తనిఖీలు చేసుకోవాలి. టాస్క్‌ఫోర్స్ సమర్థంగా పనిచేయాలి' అని స్పష్టం చేశారు. అవినీతికి తావులేకుండా పనిచేయాలని, పౌరసరఫరాల శాఖకు మచ్చతెచ్చే చర్యలను ఉపేక్షించేది లేదని మనోహర్ స్పష్టం చేశారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం పై శిక్షణ




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్వజన మెడికల్ కాలేజీలో జూన్ 28న జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన శిక్షణ తరగతులు జిల్లాలోని వైద్యాధికారులు, సూపర్వైజర్లు అందరికి జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం పై శిక్షణ నిర్వహించే 0-5 సంవత్సరాలు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించవలసిందిగా ఆదేశించారు. మొదటిరోజు పల్స్ పోలియో కేంద్రంలో రెండో రోజు, మూడో రోజు ఇంటి ఇంటికి వెళ్లి 0-5 సంవత్సరాలు పిల్లలు ఉన్నచో మిస్ అయిన పిల్లలకి పల్స్ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరు 0 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరూ కేంద్రాలకు తీసుకొని వచ్చి పోలియో చుక్కలు వేయించుకోవాల్సిందిగా తెలియజేశారు. ప్రకాశం జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలు ఉన్న ఇటుక బట్టీలు, భవన నిర్మాణ కార్మికులు, వలస దారులు దూర ప్రాంతాల్లో గాని తీర ప్రాంతాల్లో ఎక్కడ ఉన్నను వైద్య సిబ్బంది ఏఎన్ఎం, ఆశాల ద్వారా పల్స్ పోలియో తెలియపరిచి వాళ్ళని 28వ తేదీ ఆదివారం కేంద్రాలకు వచ్చే విధంగా, మొబైల్ వాహనం ద్వారా వారికీ పోలియో చుక్కలు వయవలసినదిగా ఆదేశించారు. జనసాంద్రత అధికముగా ఉన్న ఆర్టిసి బస్టాండ్ రైల్వే స్టేషన్, కూరగాయల మార్కెట్ ట్రాన్సిట్ బూతుల ద్వారా పోలియో పోలియో చుక్కలు వేయవలసినదిగా తెలిపారు. 0-5 సంవత్సరములలోపు పిల్లలు ఏ ఒక్కరు మిస్ కాకుండా అందరికి 100 శాతం పోలియో చుక్కలు వేయవలసిన భాద్యత మన అందరి పై ఉందన్నారు. పోలియో బూత్ నిర్వహణలో ప్రభుత్వం సూచించిన నియమాల ప్రకారం పోలియో బూత్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రాంతాలలో, అదే విధంగా రైల్వేస్టేషన్‌లో బస్టాండ్లలో కూడా పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమునైజేషన్ అధికారి డాక్టర్ కమల శ్రీ పాల్గొన్నారు. మాస్ మీడియా అధికారులు బెల్లం నరసింహారావు, శ్రీనివాసులు, అప్పల రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





# ఇంటర్ పరీక్షలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రైడ్ ఆఫ్ ప్రకాశం ఎక్స్ లెన్సీ అవార్డులు

## అందించనున్న బ్రిలియంట్ సంస్థ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)

విద్యా సంవత్సరం ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ కనపర్చిన ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని విద్యార్థులకు ఈ నెల 22 వ తేదీన ఒంగోలులోని ఎ1 ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ కార్యక్రమంలో అవార్డులు అందించి, వారిని సముచిత రీతిలో సత్కరించనున్నట్లు బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ అధినేత షేక్ న్యామతుల్లా భాష ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పరీక్షలలో 990 ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్, ప్రైడ్ ఆఫ్ ప్రకాశం మెరిట్ సర్టిఫికేట్, అందిస్తామని తెలిపారు. 950 ఆపైన మార్కులు వచ్చిన విద్యార్థులకు సిల్వర్ మెడల్, ప్రైడ్ ఆఫ్ ప్రకాశం మెరిట్ సర్టిఫికెట్, ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవార్డులను మెగాఫెయిర్‌కి ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రతిభ కనపర్చిన ప్రతి విద్యార్థి ఈ అవార్డు అందుకునేందుకు అర్హులు అని చెప్పారు. ఈ క్రింద ఇచ్చిన ఫోన్ నెంబర్ 8019479999కి కాల్ చేసి తమ వివరాలు నమోదు చేయించుకోవాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ వంతు సహకారం అందించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం తల పెట్టినట్లు తెలియచేస్తూ ప్రతి ఒక్క మెరిట్ విద్యార్థి ఈ సదవకాశశీ సద్వినియోగం చేసుకోవాలన్నారు.




ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
13.06.26 శనివారం


# 'సర్' ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)

పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీ కోసం కేంద్ర ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సర్ ) ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు కోరారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకూ బిఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేట్ చేయనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలతో శుక్రవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరూ ఓటర్ల జాబితాలో ఉండాలన్నదే ఎలక్షన్ కమిషన్ చేపట్టిన ' సర్ ' లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా ఓటర్ల జాబితా లోపరహితంగా రూపొందించేందుకు 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో బిఎల్వోలు ఈ ప్రక్రియ నిర్వహించే సమయంలో రాజకీయ పార్టీల తరపున బిఎల్‌ఏలు కూడా అందుబాటులో ఉండి సహకరించేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. నెల రోజుల పాటు జరిగే మ్యాపింగ్ ప్రక్రియకు సంబంధించిన పురోగతిని, క్షేత్రస్థాయి పరిస్థితిని తెలుసుకునేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రతివారం ఇలాంటి సమావేశం నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మాధురి, ఆర్డీవోలు విజయ జ్యోతి కుమారి (అద్దంకి), చంద్రశేఖర్ నాయుడు (ఒంగోలు), ఒంగోలు, కందుకూరు మున్సిపల్ కమిషనర్లు, అద్దంకి, చీమకుర్తి, దర్శి, కందుకూరు తహసిల్దార్లు, ఇతర అధికారులు, తెలుగుదేశం పార్టీ తరపున కె అంకయ్య, జి సుబ్బారావు, బిజెపి తరపున జి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ తరపున షేక్ సైదా, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ నే కాదు....రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారు

**రెండేళ్ల కూటమిపాలనలో అన్ని వర్గాల ప్రజలకు కష్టాలే**

**ఎన్నికల హామీలను నెరవేర్చటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం**

**విజయవంతంగా వైసిపి వెన్నుపోటు పాలనకు రెండేళ్లు కార్యక్రమం**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)

మామ ఎన్టీఆర్ నే కాదు, రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేసి వెన్నుపోటు పొడిచిన ఘనత చంద్రబాబు నాయుడు కే దక్కుతుందని వైసీపీ నేతలు ధ్వజమెత్తారు. వైసిపి ఒంగోలు నియోజకవర్గం ఆధ్వర్యంలో పాలనకు రెండేళ్లు అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు స్థానిక అంబేద్కర్ భవన్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.





ఈ సందర్భంగా వైసిపి ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తెలుగుదేశం ప్రభుత్వం మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడవడంతోనే ఆరంభమైందన్నారు. చంద్రబాబు నాయుడు గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రజలను కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రూ.2,76,000 కోట్లు నిధులు ప్రజలకు పంపిణీ చేస్తే, చంద్రబాబు నాయుడు మాత్రం ప్రజాధనాన్ని పంచుకొని దోచుకుంటున్నారన్నారు. ఇచ్చిన హామీని ఒకటి నెరవేర్చలేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ లేదన్నారు, రైతులు పండించిన పంటలకు (తరువాయి 4లో...)

# ఐటీఐ కళాశాలలో ఘర్షణ కమిటీ సభ్యుడు మృతి

(షణ్ముఖ వెలుగు, చీరాల, జూన్ 12)



ఈపురుపాలెంలోని ఓ ఐటీఐ కళాశాలలో కమిటీ సమావేశం ఘర్షణకు దారితీసి విషాదంగా మారింది. మాజీ ప్రిన్సిపాల్ అబ్దుల్ సత్తార్ తన కుమారుడు జిలానితో కలిసి కళాశాల సిబ్బంది పై కత్తులతో దాడి చేసిన ఘటనలో కమిటీ సభ్యుడు హుస్సేన్ (60) మృతి చెందగా, ప్రిన్సిపాల్ శేషయ్య తీవ్రంగా గాయపడ్డారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న అబ్దుల్ సత్తార్‌ను తొలగించి శేషయ్యకు బాధ్యతలు అప్పగించినప్పటి నుంచి ఆర్థిక లావాదేవీల విషయంలో కమిటీ సభ్యులతో విభేదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. అనంతరం అబ్దుల్ సత్తార్, అతని కుమారుడు జిలాని కత్తులతో దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన హుస్సేన్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రిన్సిపాల్ శేషయ్య చికిత్స పొందుతున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న చీరాల డీఎస్పీ మహమ్మద్ మెయిన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





# రెవిన్యూ సమస్యల పై తహసీల్దార్‌లు ప్రత్యేక దృష్టి పెట్టాలి

## జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు, పామూరు, జూన్ 12)

రెవెన్యూ సమస్యల పరిష్కారం పై తాహసిల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం పామూరు మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అక్రమ ఆన్‌లైన్‌లు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తుందన్నారు. ఆధారాలు లేకుండా ఇలాంటి పనులు చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్జీల పరిష్కారం పై ఉదాసీనంగా ఉండకుండా పరిష్కారం అయ్యే వాటిని తప్పకుండా చేయాలన్నారు. పామూరు, కనిగిరి, సీఎస్ పురం మండలాలకు చెందిన కొంత మంది వీఆర్వోల పనితీరుతో సమస్యలు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు.



# భార్యను హత్యచేసిన కేసులో భర్త అరెస్ట్

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 12)

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త పంధీటి దావీదును శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను గిద్దలూరు రూరల్ సిఐ జే రామకోటయ్య కొమరోలు పోలీస్ స్టేషన్ ఆవరణలో మీడియాకు వెల్లడించారు. ముద్దాయి పంధీటి దావీదు కు మరియుజ్యోతితో 17 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ముద్దాయి పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ముద్దాయి చెడు వ్యసనాలకు బానిసై మద్యం సేవిస్తూ, మృతురాలిని శారీరకంగా, మానసికంగా వేధిస్తూ, ఆమె పై అనుమానంతో కొట్టి హింసిస్తుండడంతో మృతురాలు వేధింపులు తాళలేక తన పిల్లలను తీసుకొని 3 సంవత్సరాల క్రితం తన పిల్లలతో సహా తల్లిదండ్రుల గ్రామమైన సర్వేరెడ్డిపల్లి గ్రామం వెళ్ళి అక్కడే నివసిస్తుంది. అప్పటినుండి ముద్దాయి గిద్దలూరు, గుంటూరు పరిసర ప్రాంతాలలో ఉంటూ, పెయింటింగ్ పనులు చేసుకుంటు, (తరువాయి 4లో...)



# ఎన్టీఆర్ నే కాదు....
# రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారు

గిట్టుబాటు ధరలు లేవన్నారు, డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేశారన్నారు. వెన్నుపోటు అంటే చంద్రబాబు నాయుడు అన్న తీరుగా పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చంద్రబాబు నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాని రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఏ వర్గ ప్రజలు సుఖ సంతోషాలతో లేరని, కూటమి ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఒక్క నిమిషం కూడా పాలన సాగించే హక్కు లేదని విమర్శించారు. వైసీపీ ఒంగోలు నగర అధ్యక్షులు కటారి శంకర్ మాట్లాడుతూ కేవలం రెండేళ్ల వ్యవధిలోని ప్రజా విశ్వాసం కోల్పోయింది అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నం మండల అధ్యక్షులు లంకపోతు అంజిరెడ్డి, వైసిపి వింగ్ అడ్వకేట్‌లు పాల్గొన్నారు.







# రెవిన్యూ సమస్యల పై తహసీల్దార్‌లు ప్రత్యేక దృష్టి పెట్టాలి



90 శాతం రెవెన్యూ సమస్యలే ఉన్నాయని వీటిని ప్రత్యేక దృష్టితో పరిష్కారం చేయాల్సిన బాధ్యత మీదేనన్నారు. కార్యక్రమంలో మొత్తం 326 అర్జీలు రాగా, వీటిలో రెవెన్యూ సంబంధించి 282, ఇతర సమస్యల పై 44 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో కనిగిరి ఆర్డీవో అజయ్ కుమార్, హౌసింగ్ పీడీ మోహన్‌రావు, జిల్లా మైనింగ్ అధికారి రవి ప్రసాద్, ఐసిడిఎస్ ఇంచార్జి పిడి పద్మావతి, డిఎస్‌వో అంకయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.





# ఈత సరదా ఒకరి ప్రాణం తీసింది

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 12)
స్థానిక ఎన్‌హెచ్ 16 హైవే మెయింటనెన్స్ పనుల నిమిత్తం ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకులు, ప్రకాశం జిల్లా, ఉలవపాడు మండలం హైవేని అనుకుని ఉన్న రాజుపాలెం చేరువులోకి శుక్రవారం రోజున ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో వాళ్లలో ఒకరు నీట మునిగి చనిపోవడం జరిగింది. మృతుడు వివరాలు తెలియాల్సింది.



# బాల కార్మిక వ్యతిరేక పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)
ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేకానికి సంబంధించిన పోస్టర్ ప్రారంభించడం జరిగింది. అలానే కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో పిల్లల భాగం అని, ఈ పిల్లలను కాపాడవలసిన బాధ్యత మన పై ఉందన్నారు. బాల్యం అంటే చదువుకొని వృద్ధిలోకి రావడం అని, పనిచేయడం కాదని తెలియజేశారు. ఎక్కడైనా పిల్లలు పనిచేస్తున్న ఆ సమాచారాన్ని వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, పిల్లలను పనిలో పెట్టుకున్న వారి పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఇటీవల లేబర్ డ్రైవ్‌లో చిక్కిన పిల్లలు వారి ఏజెంట్ల పై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేశామని కలెక్టర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ ర్యాలీని కలెక్టర్ ఆఫీస్ నుండి రిమ్స్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లేబర్ కమిషనర్ గౌస్ భాషా, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి దినేష్ కుమార్, నాగమణి, ఎన్జీవో నాయకులు పి సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# భార్యను హత్యచేసిన కేసులో భర్త అరెస్ట్

10 లేదా 15 రోజులకు ఒకసారి సర్వేరెడ్డిపల్లి గ్రామంనకు వచ్చి వెలుతున్నాడు. ఆ సమయంలో మరియజ్యోతి తనతో సక్యతగా ఉండక, ప్రతి చిన్న విషయానికి గొడవ పడుతున్నట్లు, అందుకు దావీదు తన భార్య పై మరింత అనుమానం పెంచుకొని, తనను ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో ఈ నెల 10వ తేదీ సర్వేరెడ్డిపల్లికి వెళ్ళగా, అంతలో మరియజ్యోతి, ఆమె చెల్లెలు జ్యోతి ఇద్దరు కలసి బహిర్భుమికి వెళ్ళి ఉన్నారు. అదే మంచి సమయంగా భావించి, దావీదు ముందుగానే దాచి ఉంచి తెచ్చుకున్న గొడ్డలితో మరియజ్యోతి పై విచక్షణారహితంగా నరకగా బలమైన రక్తగాయాలు అయి చనిపోయినది. మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు పరివేక్షణలో గిద్దలూరు రూరల్ సిఐ జే రామకోటయ్య, కొమరోలు ఎస్ఐ జె నాగరాజు, సిబ్బంది అన్ని కోణాలలో దర్యాప్తు చేసి, సాంకేతిక పరిజ్ఞానంతో పంధీటి దావీదును అరెస్టు చేశారు. హత్య జరిగిన 48 గంటల వ్యవధిలోనే ముద్దాయిని గుర్తించి అరెస్ట్ చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.



# కాంతారావు దంపతులను ఆశీర్వదించిన టిడిపి నేతలు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జూన్ 12)
యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు, గుర్రపుశాల మాజీ సర్పంచ్ ముండ్ల దానియేలు కుమారుడు కాంతారావు వివాహ వేడుక శుక్రవారం గుర్రపుశాలలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, యర్రగొండపాలెం మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగల్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు జాగర్లమూడి గాలెయ్య, కూటమి ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

# సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 12)
మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు, యువ నేత కందుల విగ్నేష్‌రెడ్డి మండలంలో పలువురికి శుక్రవారం సిఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్ళి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని రూపనగుడి లక్ష్మీరెడ్డి (బోడపాడు)కి రూ. 1,13,000, తన్నీరు చంద్రమ్మ (పెద్దయాచవరం)కి రూ. 87,908, పత్తి వెంకటేశ్వర్లు (రాజుపాలెం)కి రూ. 88,541లు, ముండ్ల మరియదాసు (రాయవరం)కి రూ. 91,334లు, కళ్ళు బక్కయ్య (రాయవరం)కి రూ. 1,23,880లు వెరసి రూ. 5,04,663 ల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన వారితో ముచ్చటించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.





# వణుకుడు వ్యాధిపై 'యశోద' విజయభేరి

**డీబీఎస్ శస్త్రచికిత్సలతో సరికొత్త ఆశాకిరణం**

**మెదడు లోతుల్లో ప్రేరణ కలిగించే అత్యాధునిక శస్త్రచికిత్సతో అద్భుత ఫలితాలు**

**హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి వైద్యుల అరుదైన ఘనత**

**ప్రాణాంతక నాడీ సంబంధిత వ్యాధికి అమెరికా, భారత నియంత్రణ సంస్థల ఆమోదిత చికిత్స**

**హుజూరాబాద్, కాజీపేటకు చెందిన ఇద్దరు రోగులకు సంపూర్ణ స్వస్థత**

**ఒంగోలు వేదికగా వివరాలు వెల్లడించిన వైద్య బృందం**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)**

ప్రపంచవ్యాప్తంగా మానవాళిని తీవ్రంగా కలవరపెడుతున్న నాడీ వ్యవస్థ క్షీణత వ్యాధుల్లో అత్యంత సాధారణమైన పార్కిన్సన్ (వణుకుడు) వ్యాధి నియంత్రణలో హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రి వైద్య బృందం విశేష నైపుణ్యాన్ని ప్రదర్శించింది. కదలికలను కట్టడి చేస్తూ మనిషిని శారీరకంగా కుంగదీసే ఈ తీవ్రమైన వ్యాధికి 'డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్' (మెదడు లోతుల్లో ప్రేరణ కలిగించే ప్రక్రియ - డీబీఎస్) అనే అత్యాధునిక శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా చెక్ పెట్టింది. శుక్రవారం ఒంగోలు నగరంలోని ఒక ప్రముఖ హోటల్ వేదికగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యశోద ఆసుపత్రి సీనియర్ నాడీ శస్త్రచికిత్స నిపుణులు, పార్కిన్సన్ వ్యాధి, కదలికల రుగ్మతల పరిశోధనా వైద్యులు రూపమ్ బోర్గొహైన్ ఈ శస్త్రచికిత్సల విజయగాథను వెల్లడించారు. దేశవ్యాప్తంగా ప్రతి లక్ష మంది జనాభాలో సగటున నలభై రెండు నుంచి అరవై మంది వరకు ఈ వణుకుడు వ్యాధి బారిన పడి తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారని గణాంకాలతో సహా వివరించారు. రక్తపోటు, మధుమేహం తరహాలోనే పార్కిన్సన్ అనేది జీవితాంతం వెన్నంటే ఉండే మొండి వ్యాధి అని, ఏటా దీని లక్షణాల తీవ్రత ప్రమాదకర స్థాయిలో పెరుగుతూ ఉంటుందని వైద్యులు స్పష్టం చేశారు. వ్యాధి నిర్ధారణ జరిగిన తొలి మూడు నాలుగు ఏళ్ల పాటు సాధారణ మందులతో కొంతమేర ఉపశమనం లభించినప్పటికీ, కాలక్రమేణా ఆ మందుల ప్రభావం పూర్తిగా సన్నగిల్లుతుందని వెల్లడించారు. సరిగ్గా ఇలాంటి క్లిష్ట దశలో రోగుల పాలిట ఒకే ఒక్క ఆశాకిరణం ఈ డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ విధానమేనని స్పష్టం చేశారు. అమెరికా ఆహార ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్-ఎఫ్ డీఏ) తో పాటు భారత ఔషధ నియంత్రణ సంస్థ (డీసీజీఐ) అధికారిక ఆమోదం పొందిన ఏకైక సమర్థవంతమైన చికిత్సా విధానం ఇదేనని ధృవీకరించారు. గత మూడు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అత్యంత నమ్మకమైన విధానంగా వాడుకలో ఉన్న ఈ ప్రక్రియ ద్వారా రోగుల జీవన ప్రమాణాలు అమాంతం మెరుగుపడతాయని వివరించారు. ఈ సంక్లిష్టమైన వైద్య ప్రక్రియలో భాగంగా మెదడులోని నిర్దిష్ట భాగంలో అత్యంత సూక్ష్మమైన విద్యుత్ వాహకాలను (ఎలక్ట్రోడ్లను) అమర్చి, వాటిని ఛాతీ భాగంలో ఉంచే ఒక చిన్న పరికరానికి అనుసంధానం చేస్తారు. దీని ద్వారా మెదడుకు అవసరమైన ప్రేరణలు అందించి వణుకుడు వ్యాధి లక్షణాలను సమర్థవంతంగా అరికడతారు. తాజాగా ఈ అత్యాధునిక విధానం ద్వారా ఇద్దరు రోగులకు యశోద ఆసుపత్రి వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన అశోక్ రెడ్డి గత మూడేళ్లుగా, కాజీపేటకు చెందిన సంగీత ఏడాది కాలంగా ఈ పార్కిన్సన్ వ్యాధి కోరల్లో చిక్కుకుని తీవ్ర అవస్థలు పడ్డారు. పరిస్థితి విషమించడంతో వీరు హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిని ఆశ్రయించారు. వీరి ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలించిన నిపుణులైన వైద్య బృందం, అత్యంత నైపుణ్యంతో డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ప్రస్తుతం ఈ ఇద్దరు రోగులు పూర్తిగా కోలుకుని అత్యంత ఆరోగ్యకరమైన సాధారణ జీవితాన్ని గడుపుతున్నారని ఆసుపత్రి వర్గాలు సగర్వంగా ప్రకటించాయి. అంతర్జాతీయ స్థాయి వైద్య ప్రమాణాలకు చిరునామాగా నిలుస్తున్న హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి, సుమారు రెండు వేల పడకల సామర్థ్యంతో రోగులకు అత్యున్నత స్థాయి వైద్య సేవలను చేరువ చేస్తోంది. ఎంతటి అరుదైన, ప్రాణాంతక మరియు సంక్లిష్టమైన వ్యాధులకైనా ప్రపంచ స్థాయి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అత్యంత సరసమైన ఖర్చుతో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని ఆసుపత్రి ప్రతినిధులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఒంగోలులో జరిగిన మీడియా సమావేశంలో యశోద ఆసుపత్రికి చెందిన వైద్యులు రూపమ్ బోర్గొహైన్, రుక్మిణి మృదుల, ప్రసాద్‌లతో పాటు హైటెక్ సిటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, ఏపీ మార్కెటింగ్ మేనేజర్ కే చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.




# " ఖేతి బచావో అభియాన్ కార్యక్రమం "

**అధిక రసాయన ఎరువులతో నేల తల్లికి ముప్పు**

**జీవన ఎరువులు వాడేద్దాం నేల ఆరోగ్యాన్ని పెంచేద్దాం**







**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 12)**

కెవికె కందుకూరు శాస్త్రవేత్తలు పొలం సంరక్షణ ప్రచార కార్యక్రమాన్ని మండలంలోని అలగాయపాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవికే శాస్త్రవేత్త డాక్టర్ ఐ వెంకటేష్ మాట్లాడుతూ రైతులు సిఫారసుకు మించి రసాయన ఎరువులు వాడడం వల్ల నేల చవుడు బారి పంటలు పండడానికి పనికి రాకుండా పోతాయని చెప్పారు. కనుక భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వేసుకోవడం వల్ల ఖర్చు తగ్గి అవశేషాలు లేని నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. జీవన ఎరువులు, సేంద్రీయ ఎరువులు, వానపాముల ఎరువులు, కంపోస్ట్, జనము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ వంటి పచ్చిరొట్ట పైర్లు తొలకరిలో వేసుకోవడం వలన సేంద్రియ కర్బణం పెరగడంతో పాటు వచ్చే ఇతర ప్రయోజనాలు రైతులకు వివరించారు. ఎల్‌నినో వలన ఈ సంవత్సర వర్షపాతం 10% తగ్గొచ్చన్నారు. తదనుగుణంగా స్వల్పకాలిక పంటలు అయిన వేరుశనగ, సజ్జ, రాగులు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త డాక్టర్ నిహారిక మాట్లాడుతూ కెవికేలో మహిళలకు సాయం ఉపాది, పై శిక్షణ ఇవ్వబడుతుందని, ఆసక్తిగల మహిళలు కెవికెలో తమ పేర్లను నమోదుచేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త మయాంక్ మామిడి ఎగుమతులకు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. మండల వ్యవసాయ అదికారి విజయ్ కుమార్ మాట్లాడుతో పచ్చి రొట్ట విత్తనాలు, జీవన ఎరువులు రైతు బరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజరు షాపుద్దీన్ , గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రెండేళ్ల కూటమి పాలన

**సంక్షేమానికి భరోసా, అభివృద్ధికి చిరునామా**

**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో**

**రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోంది**

**టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగినేని రామారావు**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)**

కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా 16 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒంగోలు నగరంలోని 35వ డివిజన్‌లో ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగినేని రామారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల సంక్షేమం మరియు అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని, ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసుకుందని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ నుంచి సూపర్ గ్రోత్ వరకు... అన్న క్యాంటీన్ నుంచి అమరావతి నిర్మాణం వరకు... సుపరిపాలన నుంచి పోలవరం పూర్తి లక్ష్యం వరకు... ప్రతి రంగంలోనూ ప్రభుత్వం స్పష్టమైన ముద్ర వేసిందన్నారు. రైతుకు అండగా, మహిళకు రక్షణగా, యువతకు ప్రోత్సాహంగా, పేదలకు భరోసాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన, మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందన్నారు. సమర్థ నాయకత్వం, పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల అంకితభావమే ప్రభుత్వ విజయాలకు మూలస్తంభాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ అధ్యక్షులు ఎస్.కే.టి. రాజేష్, ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి గార్లపాటి శ్రీనివాసరావు, సెక్షన్ కోఆర్డినేటర్ మలిపెద్ది నాగేశ్వరరావు, మారెళ్ల నాగలింగేశ్వరరావు, 95వ బూత్ ఇన్‌చార్జ్ సిరిగిరి వెంకటరావు, 94వ బూత్ ఇన్‌చార్జ్ పోతినేని వెంకటేశ్వర్లు, 93వ బూత్ ఇన్‌చార్జ్ గుండబొమ్మ వెంకట్రావు, ఒంగోలు టౌన్ టీడీపీ మాజీ అధ్యక్షులు బొడ్డపాటి హనుమంతరావు, కేఎస్ఎస్ సభ్యులు మారెళ్ల వాసు, కేఎస్ఎస్ సభ్యురాలు జొన్నాదుల శారద, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద సంఖ్యలో





## షూటింగ్‌లో సత్తాచాటిన క్విస్ ఎన్ సీసీ క్యాడెట్లు ఇద్దరికి గోల్డ్, ఒకరికి బ్రాంజ్

ఇంటర్ గ్రూప్ షూటింగ్ కాంపిటీషన్‌లో సత్తా







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)**

ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ సీసీ క్యాడెట్లు ఇంటర్ గ్రూప్ స్పోర్ట్స్ షూటింగ్ కాంపిటీషన్‌లో ప్రతిభ కనబరిచారు. ఇది అధునాతన రైఫిల్, పిస్టల్ షూటింగ్‌లో క్యాడెట్‌లను గుర్తించడం, శిక్షణ ఇవ్వడం, పరీక్షించడం పై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఒక ప్రతిష్టాత్మకమైన, కేంద్రస్థాయిలో నిర్వహించే శిబిరం. కాగా ఈ శిబిరంలో నిర్వహించిన షూటింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్, బ్రాంజ్ మెడల్స్‌ని సాధించి సత్తాచాటారు. సీఎస్ డీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న సంద్రపాటి వెంకటేశ్ 22మీటర్ల రైఫిల్ విభాగంలో గోల్డ్, ఏఐడీఎస్ చదువుతున్న ఓం సాయి తేజ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో గోల్డ్, కీర్తన 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈనెల 3 నుంచి 12 వరకు తెలంగాణలోని కరీంనగర్ లో జరిగిన క్యాంప్ లో పాల్గొన్న ఎన్ సీసీ క్యాడెట్లు షూటింగ్ పై ప్రత్యేక శిక్షణ తీసుకుని అత్యుత్తమ ప్రదర్శన చేశారు. దీనికి గాను వాళ్లంతా నెక్స్ట్ లెవెల్ క్యాంప్ కి ఎంపికయ్యారు. గోల్డ్, బ్రాంజ్ పతకాలు సాధించిన క్యాడెట్లకు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి అభినందించారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ఎప్పుడూ ముందుంటారని ఈ సందర్భంగా అన్నారు.

## ప్రజలకు నిరంతరాయం నాణ్యమైన విద్యుత్ అందించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎండి పుల్లారెడ్డి





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)**

ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించాలని ఏపీసీపీడీసీఎల్ సిఎండి పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం విద్యుత్‌శాఖ కార్పొరేట్ కార్యాలయం నుండి సీఎండీ పుల్లారెడ్డి, డైరెక్టర్లు, ప్రకాశం, మార్కాపురం జిల్లా ఎస్‌ఈలు, ఈఈ, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ సరఫరా నాణ్యత, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం, వర్షాకాలానికి ముందస్తు సన్నద్ధత, విద్యుత్ భద్రత చర్యలు, ఆదాయ వసూళ్లు, పంపిణీ నష్టాల తగ్గింపు, పెండింగ్ పనుల పురోగతి తదితర అంశాల పై సమగ్రంగా చర్చించారు. సీఎండీ అన్ని స్థాయిల అధికారులు ప్రజలకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అలాగే, వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమీక్ష సమావేశంలో లైన్ లాసెస్ తగ్గింపు, రెవెన్యూ కలెక్షన్లు, సబ్‌స్టేషన్ పనుల పురోగతి, ఫీడర్ లెవెల్ సోలరైజేషన్, పిఎం సూర్యఘర్, పిఎం కుసుం, ఆర్‌డిఎస్‌ఎస్ పనులపై సీఎండీ సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో నాణ్యతను మరింత మెరుగుపరచాలని, వినియోగదారుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. లైన్ లాసెస్ తగ్గింపు, రెవెన్యూ వసూళ్లలో సర్కిల్ లక్ష్యాలను సాధించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థకు సంబంధించిన పలు కీలక అంశాల పై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సమావేశంలో డైరెక్టర్ టెక్నికల్ ఎ మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ టీవీఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఖాతాదారులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యం

### స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి నెట్ వర్క్ 2 జనరల్ మేనేజర్ కుందన్ జ్యోతి



**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, జూన్ 12)**

ఖాతాదారులకు మరింత మెరుగైన,సౌకర్యవంతమైన సేవలు అందించడమే తమ లక్ష్యమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి నెట్ వర్క్ 2 జనరల్ మేనేజర్ కుందన్ జ్యోతి అన్నారు. ఎస్‌బిఐ ఒంగోలు రీజియన్ పరిధిలోని చీమకుర్తిలోని బ్యాంక్ నూతన ప్రాంగణాన్ని గుంటూరు పరిపాలన కార్యాలయం డిప్యూటి జనరల్ మేనేజర్ అశోక్ వి సోనునేతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఒంగోలు రీజనల్ మేనేజర్ కె శ్రీధర్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హోం లోన్ సెంటర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి శ్రీరామ్, ఒంగోలు రీజనల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్లు కె హారతి, వేదం రాజేష్ బాబు, రవికుమార్, హెచ్ ఆర్ మేనేజర్ విశ్వనాథ్, కె జానకి రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ కుందన్ జ్యోతి మాట్లాడుతూ ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించే క్రమంలో తమ శాఖను విశాలమైన ప్రాంగణంలోనికి మార్చడం జరిగిందన్నారు. గ్రానైట్ మైనింగ్‌కు చీమకుర్తి ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంక్ వివిధ రుణ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎంఎస్ఎంఈ రంగానికి ఎంతో చేయూత ఇస్తున్నామన్నారు. ముద్ర పథకం ద్వారా అసంఘటిత రంగంలోని వారికి రుణాలు అందిస్తున్నామని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ పనిచేస్తుంటారని వారందరికి అవసరమైన బ్యాంకింగ్ సేవలను తమ శాఖ ద్వారా పొందవచ్చన్నారు. యూనో యాప్ ద్వారా అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను సులభంగా పొందే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ మేనేజర్ అశోక్ వి.సోనునే మాట్లాడుతూ, బ్యాంకింగ్ సేవలను అందరికి అందించడమే తమ ధ్యేయమన్నారు. బ్యాంక్ ద్వారా అందే అన్ని రకాల సేవలు, సౌకర్యాల గురించి ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ కుందన్ జ్యోతి, డిప్యూటి జనరల్ మేనేజర్ అశోక్ వి సోనునే లను ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు వ్యామిజాల శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ నాయకులు సుధాకర్, పి వెంకట్‌రెడ్డి, ఎస్‌ఈడబ్ల్యుఏ నాయకులు తేజస్వి, దుగ్గిరాల కార్తీక్ జి కిరణ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. చీమకుర్తి బ్రాంచి మేనేజర్ కెఎల్ ప్రసన్న స్వాగత వచనాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఫీల్డ్ ఆఫీసర్ బ్రహ్మ తేజ వందన సమర్పణతో ముగిసింది. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

**ప్రమాద బీమా చెక్కు అందించిన జనరల్ మేనేజర్**







స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ వద్ద వేతన ఖాతా కలిగిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కోటీ రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్న విషయం మనకు విదితమే. ఇందులో భాగంగా ఎపిసిపిడిసిఎల్ ఉద్యోగి తాటిపర్తి రాజీవ్ తన వేతన ఖాతా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంతపేట శాఖలో ఉండటంతో ఇటీవల ఆయన ప్రమాదవశాత్తూ మరణించడంతో రాజీవ్ తండ్రి తాటిపర్తి శ్యామ్యూల్ దేవ వర ప్రసాదరావుకు కోటి రూపాయల బీమా మొత్తం మంజూరైంది. ఈ బీమా చెక్కును బ్యాంక్ నెట్ వర్క్ జనరల్ మేనేజర్ కుందన్ జ్యోతి ఒంగోలు రీజియన్ పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం రీజియన్ పరిధిలోని బ్యాంక్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ సంతపేట శాఖ చీఫ్ మేనేజర్ వివేక్ కుమార్ పాల్గొన్నారు.

# ఎరువుల కొనుగోలు పై అవగాహన

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 12)**

మండలంలోని ఇప్పగుంట గ్రామ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి వి రాము రైతులకు రాబోయే సీజన్లో యూరియా, డిఏపి ఎరువుల కొనుగోలు గురించి ప్రత్యేక ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎలా కొనుగోలు చేయాలో మండల వ్యవసాయ అధికారి వివరించారు. ముందుగా గ్రామ వ్యవసాయ సిబ్బంది వారి స్వర్ణ గ్రామ పరిధిలోని సాగు చేయు రైతులకు ప్రత్యేకమైన ఏపీ ఏఐ ఎంఎస్ యాప్ లో పొందుపరచాలి తదుపరి ప్రైవేటు రిటైల్ డీలర్, పిఎసిఎస్ షాపులను వారి పరిధిలో అనుసంధానం చేయాలి అలాగే ఎరువుల డీలర్లు అదే యాప్లో వారి షాపులను రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. రైతులు ముందుగా గ్రామ రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సలహాదారులను సంప్రదించి వారి పొలాలను, వేయబోవు పంటలను ఎంత విస్తీర్ణంలో వేస్తారో నమోదు చేసుకుని ఎరువుల డీలర్లను వారి యొక్క ఆధార్ కార్డు నెంబర్‌తో సంప్రదించి యూరియా, డిఏపి ఎరువులను పొందవచ్చు అని తెలియజేశారు. అలాగే రైతులకు ఎరువులు కొనుగోలు చేసే ప్రక్రియ డెమో రూపంలో చూపించడం జరిగింది వ్యవసాయ శాఖ సంచాలకులు గుంటూరు వారి ఆదేశాల మేరకు ఈ నెల 8వ తేదీ నుండి యూరియా, డిఏపి ఎరువులను పారదర్శకంగా పొలం ఉన్న రైతులందరికీ వారి ఆధార్ నెంబర్తో అనుసంధానం అయిన పొలానికి ఎరువులను గ్రామ రైతు సేవా కేంద్రాలు, రిటైల్ ఎరువుల షాపుల ద్వారా విక్రయించబడుతున్నాయని తెలిపారు. ఈ విధానం ద్వారా రైతులు ఇబ్బంది పడకుండా, కృత్రిమ కొరత లేకుండా, ఎరువులు పక్కదారి మళ్లింపు నివారణకు, అక్రమ నిల్వలు బ్లాక్ మార్కెట్ తరలింపు, కౌలు రైతులకు నష్టం కలగకుండా ఉండటానికి ,యూరియా డిఏపి అవసరానికి మించి వాడకం తగ్గించడానికి ఈ విధానాన్ని ఏర్పాటు చేశారని మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు. అలాగే మండలానికి పచ్చిరొట్ట విత్తనాలు జనుములు 120 కింటాలు మంజూరు అయ్యాయని కావలసిన రైతులకు సంబంధిత రైతు సేవ కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే ప్రతి రైతు రైతు సేవ కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రైతు ఆధార్ నెంబర్తో విశిష్ట రైతు గుర్తింపు సంఖ్య తీసుకోవాలని, తద్వారా రాబోయే రోజుల్లో వ్యవసాయ శాఖ ద్వారా అన్ని పథకాలకు అర్హులు అవుతారని వివరించారు. ప్రతి రైతు ఏపీ ఎయిమ్స్ యాప్ లో ఆధార్ తో రిజిస్ట్రేషన్ చేసుకుని 15 రకాల సమాచారం అనగా చీడపీడలు నివారణ యంత్ర పరికరాల బుకింగ్, వాతావరణం, ప్రభుత్వ పథకాలు, పంట నష్టం, మార్కెట్ పంట ధరలు, తదితర వివరాలు తెలుసుకోవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు ఐ బ్రాహ్మణి, పొన్నలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కొండలరావు, సీఈవో మనోజ్ కుమార్, ఉన్నం నర్సింగరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు






# పూర్వ ప్రాథమిక విద్య పై దృష్టి పెట్టాలి

## మార్కాపురం జిల్లా ఐసీడీఎస్ పీడీ ఎం పద్మావతి

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 12)**

కనిగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు మీటింగు ఐసిడిఎస్ సిడిపిఓ కే సరోజినీ ఆధ్వర్యంలో కనిగిరి లోని ఎంపీడీవో ఆఫీసు నందు నిర్వహించగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కాపురం జిల్లా ఐసిడిఎస్ పిడి ఎం పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనిగిరి ప్రాజెక్టులోని పబ్లిక్ పర్సెప్షన్ పాజిటివ్ కాల్స్ గురించి వివరించారు. జూన్ 1 నుండి 20 వరకు అంగన్వాడీ పిలుస్తుంది కార్యక్రమం ప్రతి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించి మూడు నుండి ఆరు సంవత్సరాల వయసు గల పిల్లలందరినీ అంగన్వాడికి కేంద్రాల్లో మాత్రమే నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. రిమోట్ లెర్నింగ్ మెసేజ్‌ల ప్రకారం ప్రతి అంగన్వాడి కేంద్రంలో మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలందరికీ పూర్వ ప్రాథమిక విద్య అందించాలన్నారు. అంగన్వాడీలో పూర్వ ప్రాథమిక విద్యను మరింత మెరుగ్గా అందించాలి. కమ్యూనిటీ పార్టిసిపేషన్, తల్లులకు అంగన్వాడీల ద్వారా అందుతున్న అన్ని రకాల సర్వీసులు గురించి అవగాహన కలిగించాలన్నారు. అంగన్వాడి కార్యకర్తలు సమయపాలన పాటించాలన్నారు. గ్రోత్ మానిటరింగ్ తప్పులు లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా ఐసిడిఎస్ పిడి ఎం పద్మావతి, కనీగిరి సిడిపిఓ పి సరోజినీ, ఐటీసీ ప్రథమ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సోమా వెంకట్రావు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, కనిగిరి ప్రాజెక్టులోని అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





# పైన జంగిల్ రాజా....

## ఇక్కడ వసూలు రాజా పరిపాలనలో ప్రజలు అల్లాడిపోతున్నారు

**వెన్నుపోటుకు రెండేళ్లు భారీ నిరసన ర్యాలీ**

**లవ్ లెటర్ ద్వారా గిట్టుబాటు ధర రాదు**

**రేషన్ బియ్యం, ఇసుక, మట్టి మాఫియా దందాతో పాటు**

**అక్రమ గంజాయి, పవిత్ర పుణ్యక్షేత్రంలో అవినీతి**

**గాంధీ మార్గంలో శాంతియుతంగా నిరసన తెలిపితే అడుగడుగున పోలీసులతో ఆటంకాలు**

**సొంత డబ్బా కొట్టుకుని అభివృద్ధి అంటే నమ్మే వాళ్ళు ఎవరూ లేరు**

**అభివృద్ధిపై మాట్లాడదాం ఓపెన్ డెబిట్ కు సిద్ధం చాలెంజ్**

**అన్ని పంచాయితీల్లో వార్డుల్లో అభ్యర్థులను పెడతాను**

**రిగ్గింగును అడ్డుకుంటాను.**

**పార్టీ జెండాలు బ్యానర్లు ప్లే కార్డ్స్ నల్లకండువాలతో భారీ నిరసన**

**నిరసన ప్రదర్శనలో అత్యధికంగా పాల్గొన్న మహిళలు**







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 12)

కందుకూరు నియోజకవర్గంలో వసూలు రాజా పరిపాలన వచ్చి రెండేళ్లు అయ్యింది ఈ వసూలు రాజా అన్న మాట నేను అన్నది కానేకాదు బాబు.. తెలుగుదేశం పార్టీ తమ్ముళ్లు అన్న మాట ఇది, తెలుగుదేశం పార్టీ పేపర్లు ప్రతిరోజు రెండు సంవత్సరాల నుండి రాస్తున్న మాట ఇది అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని కందుకూరు పట్టణంలో నిర్వహించి స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సభా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కుర్చీ కోసం ఎన్నో అబద్ధాలు ఆడుతాడు అని అది ఆయనకు వెన్నతో పెట్టిన విద్య, దీనిని నమ్మి మోసపోయిన ఆంధ్ర రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పాలవుతున్నారని విమర్శించారు. మోసం జరిగి అప్పుడే రెండేళ్లు జరిగిపోయాయని ఈ రెండేళ్ల తర్వాత దివంగత మహానేత తనయుడు,ఆంధ్రరాష్ట్ర ముద్దుబిడ్డ వైఎస్ జగన్ పరిపాలనలో కులాలకు, మతాలకు, ప్రాంతాలకు భిన్నంగా జరిగిన మంచిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. జగనన్న పరిపాలనలో అన్ని వర్గాలకు పథకాలు ఇచ్చి దేశంలోనే ఘనత వహించాడని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పథకాలతో పాటు సూపర్ సిక్స్ ఇస్తామని హామీలు గుప్పించి అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం హామీలన్నీ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకపోతే కందుకూరే కాదు రాష్ట్రంలో 175 సీట్లలో ఏ ఒక్కటి గెలిచే పరిస్థితి లేదని అన్నారు. కందుకూరు ఎమ్మెల్యే అయితే సొంత డబ్బా కొట్టుకుంటూ అదే అభివృద్ధి అని మాట్లాడుతున్నాడు తప్ప ప్రజలకు హామీ ఇచ్చిన అన్ని పథకాలను అమలు చేయించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇచ్చిన పథకాలకే దిక్కు లేకపోతే నలుగురిని కనండి పథకాలు పెంచుతామంటున్నారు. కన్నవాళ్ళకే దిక్కులేదు గాని కనబోయే వాళ్లకి ఏమీ పథకాలు ఇస్తారు. అది కాదు అభివృద్ధి ఇచ్చిన హామీలన్నిటిమీద మాట్లాడదాం ఓపెన్ డెబిట్ కు సిద్ధం ఛాలెంజ్ అని సవాలు విసిరారు. ఒక రోడ్డు వెడల్పు చేసి నీ పార్టీ రంగుల లైట్లు వేసుకొని అభివృద్ధి అంటే నమ్మే పరిస్థితి లేదని నిజమైన అభివృద్ధి చేస్తే మేము కూడా స్వాగతిస్తామని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయమని స్వచ్ఛందంగా రోడ్డు పైకి వచ్చిన ప్రజలను పోలీసు వారిని అడ్డం పెట్టి ఆపాలని ప్రయత్నిస్తున్నావు. ఇవన్నీ కందుకూరు ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఈ రెండేళ్ల కాలంలో నీ బాగోతం చూస్తే రేషన్ బియ్యం అవినీతి జరుగుతుందని మీడియా సాక్షిగా మేము పట్టిస్తే అవినీతి చేసిన వారి పై చర్యలు తీసుకోకుండా అధికారిని మార్చి చేతులు దులుపుకున్నావన్నారు. దీంతో నీ అనునాయులు మరింత దోపిడిని కొనసాగిస్తూ రేషన్



బియ్యాన్ని దొంగతనంగా అమ్ముకుంటున్నారు. సాక్షాత్తు మహిమ కలిగిన మాలకొండ లక్ష్మీ మాల్యాద్రి స్వామి ఆలయంలో అవినీతికి అంతే లేకుండా పోయింది అధిక ధరలు పెట్టి పూజా సామాగ్రిని అమ్మిస్తున్నారు. నేను రోజు మీడియా ముందు గోల చేస్తేనే పాత బకాయిలు రెండున్నర కోట్లు కట్టించావు తప్ప అది కూడా నేను మాట్లాడకపోతే హాంఫట్ చేసే పరిస్థితి ఈ నియోజకవర్గంలో దాపురించిందని అన్నారు. అక్రమ లేఔట్లు వేసి ఎటువంటి పర్మిషన్ లేకుండా మట్టిని రాత్రి,పగలు తేడా లేకుండా నీ చుట్టూ ఉన్నవారే తోలుతుంటే దీనిమీద ఎటువంటి చర్యలు తీసుకొనకపోగా నోరెత్తి మాట్లాడిన వాళ్ళ మీద కక్ష సాధింపులు చేసి భయభ్రాంతులకు గురిచేసే పరిస్థితి కందుకూరు నియోజకవర్గంలో ఉంది.దొంగ కేసులు పెట్టి జైల్లో వేయించేందుకు కూడా సిద్ధపడుతున్నారు. కల్తీ మందు ఊరూరా బెల్ట్ షాపుల ద్వారా అందిస్తున్నారు. గుడ్లూరులో స్పిరిట్ కలిసిన కల్తీ మందు భారీగా దొరికితే కల్తి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా మాఫీ చేపించిన పరిస్థితి ఉంది. నియోజకవర్గంలో కల్తీ మద్యం ఆపాలి, బెల్ట్ షాపులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాము. కందుకూరు పట్టణంలో అయితే గంజాయిని సరఫరా చేసే అసలైన వారిని పట్టుకోకుండా చిన్న పిల్లలను పట్టుకొని చేతులు దులుపుకున్నారు. యువత భవిష్యత్తు బాగుపడాలంటే గంజాయిని నిర్మూలించాలి. అన్ని రకాల దోపిడీ ద్వారా వసూలు రాజా అవతారమెత్తి వసూలు చేసుకునే పనిలో నిమగ్నమై ఉన్నావని డబ్బులు ఉంటేనే ఎమ్మెల్యేలు కారు ప్రజలకు మంచి చేస్తేనే గెలుస్తాము అని హితవు పలికారు. జగనన్న ఇచ్చిన పథకాలతో సంతోషంగా ఉన్న కుటుంబాలు మళ్లీ తిరిగి జగనన్న పరిపాలన రావాలని ఎదురు చూస్తున్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో మిమ్మల్ని వంగోబెట్టి గుద్దుతారు.పోలీసులను, అధికారులను అడ్డం పెట్టుకుని రిగ్గింగ్ చేస్తామనుకుంటున్నావేమో ఖాంచత్ ఒక్కచోట కూడా రిగ్గింగ్ జరగనివ్వను,అన్ని పంచాయితీలు, వార్డులలో అభ్యర్థులను పెడతా చూసుకుందాం జనం తిరగబడితే నీ పోలీసులు ఏమి చేయలేరు అని అన్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా, శాంతియుతంగా, గాంధీ మార్గంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ మాకిస్తాను అన్న పథకాలు మాకు ఇవ్వండి బాబు అని రోడ్డు మీదకు వచ్చి అడిగితే పోలీసులను పెట్టి అడ్డంకులను సృష్టిస్తూ దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారు. ఎవ్వరి దయాదాక్షిణ్యాలు నాకు అవసరం లేదు కార్యకర్త అయిన మీ అందరి కష్టంతో నేను గెలుస్తాను రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా కందుకూరు నుండి గెలిసి జగన్మోహన్ రెడ్డికి కానుక ఇద్దామని,చైతన్యం గలిగిన కందుకూరు నుండి మార్పు రావాలని,జగన్మోహన్ రెడ్డి పార్టీ జెండా మోస్తున్న వారు నాకు అండగా ఉన్నారు . ప్రతి కార్యకర్తకు నేను అండగా ఉంటా జగన్,జనం, బుర్రా మాత్రమేనని ఈ సందర్భంగా మాట్లాడారు. కందుకూరు నియోజకవర్గంలో గిట్టుబాటు ధర అడిగిన పొగాకు రైతు ప్రతినిధులపై కేసులు బనాయించినారు. అదేవిదంగా ఏ పార్టీకి సంబంధం లేకుండా రైతులు రోడ్డు మీదకు వచ్చి గిట్టుబాటు కల్పించమని అడిగితే మంత్రికి లెటర్ ఇచ్చి చేతులు దులుపు కొన్నావు లవ్ లెటర్ ద్వారా గిట్టుబాటు ధర రాదు. ముఖ్యమంత్రితో మాట్లాడి స్థిరమైన ప్యాకేజీని కల్పించి పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి తప్ప మినిస్టర్ కి లెటర్ ఇస్తే రైతుకు న్యాయం జరగదని నిజాయితీ లేని రాజకీయాలు సరైనవి కాదని ఈ పరిపాలనలో ఏ ఒక్క ప్రజలు సంతోషంగా లేరని పైన జంగిల్ రాజా,ఇక్కడ వసూలు రాజా పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. స్థానిక ఫాదిరి బంగ్లా (మెర్సీ స్కూల్) నుండి వేలాది మందితో ర్యాలీ ప్రారంభమైనది మండుటెండను సైతం లెక్కచేయకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పోలీసులు అడుగడుగున ఆటంకం కల్పిస్తున్న కూడా కందుకూర్లో కదం తొక్కారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గంలో నుండి అత్యధికంగా మహిళలు పాల్గొని విజయవంతం చేశారు. నిరసన కార్యక్రమంలో పార్టీ జెండాలు బ్యానర్లు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గుర్తు చేస్తూ ప్రదర్శించిన ప్లే కార్డ్స్ నిరసనగా ధరించిన నల్ల కండువాలు భారీ పార్టీ జెండాలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరలు ధరించిన మహిళలు ఆకర్షణీయంగా నిలిచాయి. ముందుగా ప్రజాస్వామ్య,లౌకిక, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# పిల్లల భద్రత, సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణ పై అవాగాహన





**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి సిహెచ్‌వి రామకృష్ణ**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)

పిల్లల భద్రత, సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణ పై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వివిధ కార్యక్రమాల రూపొందించి నిర్వహిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి సిహెచ్ వి రామకృష్ణ అన్నారు. శుక్రవారం మిస్సింగ్ చిల్డ్రన్ డే సందర్భంగా పట్టణంలోని బాల సదన్ లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. పిల్లలు కనిపించకుండా పోయిన సందర్భాల్లో వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, పిల్లల ఫోటోలు, పూర్తి వివరాలు అందించాలని సూచించారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పిల్లల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, ఇతర దోపిడి రూపాల నుండి వారి రక్షించేందుకు ప్రభుత్వం, పోలీస్ శాఖ, బాలల సంక్షేమ సంస్థలు సమన్వయంతో పని చేస్తున్నాయని తెలిపారు. ప్రతి పౌరుడు పిల్లల రక్షణలో భాగస్వామి కావాలని సంబంధిత అధికారులకు పిలుపునిచ్చారు. అదే విధంగా బాలసదన్ మెరుగైన నిర్వహణకు సదన్‌లో పనిచేసే ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలన్నారు. సమయపాలన పాటిస్తూ పిల్లలకు మరింత మెరుగైన సదుపాయాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల సంరక్షణ కమిటీ సభ్యులు సుమనశ్రీ, జీజీదీ లీగల్ అడ్వైజర్ రత్న ప్రసాద్, న్యాయ సేవ సహాయకులు పాటిబండ్ల సతీష్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.




# ఒంగోలు నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడిగా పూల శ్రీనివాస్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)

ఒంగోలు కాపునాడు కార్యాలయంలో కాపునాడు ఎగ్జిక్యూటివ్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఒంగోలు నియోజకవర్గ కాపునాడు అధ్యక్షులుగా పూల శ్రీనివాస్, దర్శి నియోజకవర్గం తాళ్లూరు మండల కాపునాడు అధ్యక్షులుగా కుటాల పవన్ కుమార్‌ని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా కాపునాడు ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాలు, మండల కమిటీల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, జూలై మొదటి వారంలో ఒంగోలు పార్లమెంట్ పరిధిలో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ గారా నారాయణరావు, కోశాధికారి చెంగలశెట్టి సుధాకర్, మార్కాపురం జిల్లా కన్వీనర్ వెలుగోలు కాశీ విశ్వనాథ్, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ మేకల నారాయణ, ఒంగోలు మహిళా కాపునాడు జనరల్ సెక్రటరీ నగుబోతు నిర్మల, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు. కాపు సమాజ అభ్యున్నతి కోసం కాపునాడు సంస్థ మరింత బలోపేతం కావాలని సమావేశం ఆకాంక్షించింది.

## బాలలతో పని చేయించడం చట్టరీత్యా నేరం





(షణ్ముఖ వెలుగు, పామూరు, జూన్ 12)

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం పామూరు పట్టణంలో కార్మిక శాఖ,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బాల కార్మిక నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుబ్బారాయుడు దుకాణాలు, మెకానిక్ షెడ్లు, పెట్రోల్ బంకులను తనిఖీ చేసి బడిఈడు పిల్లలతో పని చేయించడం చట్టరీత్యా నేరమని, బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం నిబంధనలను వివరించారు. పిల్లలను పనిలో కాకుండా పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని సూచించారు. గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, బాలల హక్కుల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గుడ్ హెల్ప్ సంస్థ ప్రతినిధి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## 6 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్ ఎస్ఐ బ్రహ్మనాయుడు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 12)

6 మంది పేకాటరాయళ్ళను పట్టుకొని వారి నుండి రూ.1010 స్వాధీనం చేసుకుని అరెస్టు చేసిన సంఘటన మండలంలోని కేతగుడిపి గ్రామ పంచాయతీలో గల జగనన్న కాలనీ వద్ద జరిగింది. ఎస్ఐ బ్రహ్మనాయుడు కథనం ప్రకారం ఇటీవల మండలంలో గతంలో కొన్ని కుటుంబాలు పేకాట, బెట్టింగులు, జూదం లాంటి చెడువ్యసనాలకు లోనై మద్యం ప్రియులుగా మారి వారి కుటుంబాలు అభాసుపాలయ్యాయన్నారు. దీంతో ఇటీవల మండలంలో పేకాటరాయుళ్ల హల్చల్ ఉందని గమనించి నిఘా వేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా కేతగుడిపి పంచాయతీలోని జగనన్న కాలనీలో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారాన్ని పసికట్టడం జరిగిందన్నారు. దీంతో హుటాహుటిన తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఒకపాత గృహంలో 6 గురు పేకాటాట ఆడుతుండగా చాకచక్యంగా పట్టుకుని రూ.1010 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వారందరి పై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ పాత్రికేయులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బ్రహ్మనాయుడుతో పాటు కానిస్టేబుళ్లు రఘు, నాయక్, జనార్ధన్‌లు ఉన్నారు.

## ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆకురాతి శాంతిలక్ష్మి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)

ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్‌గా ఆకురాతి శాంతిలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి రాజాబాబును తన ఛాంబర్ నందు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# 15న ఎస్సీ, ఎస్టీ సమస్యల ప్రత్యేక పరిష్కార వేదిక

### దళిత నేత నీలంతో కలెక్టర్ రాజాబాబు వెల్లడి

### ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫండ్స్ ట్రెజరీ నుండి ఫైనాన్స్ డిపార్ట్మెంట్ కు పంపించి బాధితుల ఎకౌంట్లో వేయాలి

### కలెక్టర్‌కు మాల మహానాడు నాయకుల విజ్ఞప్తి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)

ఈ నెల 15వ తేదీ సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్లోని గ్రీవెన్స్‌లో ఎస్సీ ఎస్టీ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజాబాబు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావుకు తెలియజేశారు. దళితుల సమస్యలపై జిల్లా కలెక్టర్ రాజాబాబును మాల మహానాడు, మాదిగ పరిరక్షణ సమితి,యానాది పరిరక్షణ సమితి నాయకులతో కలిసి శుక్రవారం కలెక్టరేట్లో కలిశారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు మాదిగ మాన్యం హక్కు వారసత్వం కలిగిన సర్వేనెంబర్ 306/1లో సంతనూతలపాడు తాసిల్దార్ లక్ష్మీనారాయణ రెడ్డి భూ కబ్జాదారుల దుంపా సంగ్రావరెడ్డి ముఠాకు అమ్ముడుపోయారన్నారు. మాదిగల భూమి రికార్డు వక్రీకరిస్తూ సంగ్రామరెడ్డి ముఠా సృష్టించుకున్న ఫేక్ డాక్యుమెంట్లు కోర్టు ఆర్డర్లను సాకు గా చూపి కనిగిరి తెలుగుదేశం ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఒంగోలు తెలుగుదేశం భూకబ్జా నాయకుడు పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్ రెడ్డి మాదిగల మాన్యాన్ని మాదికులకు దక్క కుండా చేస్తున్నారన్నారు. మాదిగ కులస్తుడైన సంతనూతలపాడు ఎస్సై అజయ్ బాబుతో మాదిగలను బెదిరిస్తూ పోలీస్ స్టేషన్కు పిలిపించి బెదిరిస్తూ దగ్గరుండి చట్టవిరుద్ధంగా ఒంగోలు డిఎస్పి,రూరల్ సీఐ శేషగిరిరావు లు ఫెన్సింగ్ వేయిస్తున్నారన్నారు. మాదిగల పంటను ధ్వంసం చేసి దౌర్జన్యం చేసి మహిళలను అవమానించిన దుంపా కోటిరెడ్డి ముఠాపై ఎస్సీ ఎస్టీ కేసు కట్టకుండా సంతనూతలపాడు ఎస్సై దుంపా సంగ్రామిరెడ్డి ఫిర్యాదు మేరకు మాదిగలపై తప్పుడు కేసులు కట్టారన్నారు. మాదిగలకు సంబంధంలేని ఇంజక్షన్ ఆర్డర్ కమ్మ కులానికి చెందిన శ్రీనివాసరావు అనే పేరుతో తెచ్చి మాదిగలను భూమిలోకి రాకుండా సంతనూతలపాడు ఎస్సై అజయ్ బాబు,, సంతనూతలపాడు ఎమ్మార్వో లక్ష్మీనారాయణ రెడ్డిలు మాదిగ భూ హక్కుదారులను బెదిరిస్తూ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు.

జాయింట్ కలెక్టర్ తో విచారణ జరిపించి సంతనూతలపాడు ఎస్ఐ అజయ్ బాబును,ఎమ్మార్వో లక్ష్మీనారాయణ రెడ్డి ను సస్పెండ్ చేయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫండ్ జిల్లాకు 2 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరైనవని,గతంలో జిల్లా కలెక్టర్ నేరుగా ఎస్సీ ఎస్టీ బాధితుల అకౌంట్లోకి జమ చేసేవారు అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు రెండు సంవత్సరాల కానుకగా ఎస్సీ ఎస్టీ రిలీఫ్ ఫండ్ విడుదల క్లిష్టతరం చేసిందన్నారు. ౹ాఖీమీ సిస్టం నుండి జఖీమీ సిస్టంకు మార్చి ఎస్సీ ఎస్టీల బాధితులని చకోర పక్షుల మార్చిందన్నారు. కలెక్టరేట్ నుండి కోటి రూపాయలు జిల్లా ట్రెజరీకి వెళ్లాయని మిగతా కోటి యాభై లక్షల కూడా ట్రెజరీకి పంపాలని జిల్లా కలెక్టర్ ను నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. తరువాత దక్షిణ బైపాస్ రోడ్ లో ఉన్న జిల్లా ట్రెజరీ కార్యాలయానికి వెళ్లి జిల్లా ట్రెజరీ అధికారి జగన్నాధ రావు తో ఎస్సీ ఎస్టీ రిలీఫ్ ఫండ్స్ రెండు కోట్ల యాభై లక్షల రూపాయలు ప్రత్యేక అకౌంట్ నెంబర్లు క్రియేట్ చేసి తాడేపల్లి సెక్రటేరియట్ లోని ఫైనాన్స్ డిపార్ట్మెంట్ కు పంపించాలన్నారు. అంతట జిల్లా ట్రెజరీ అధికారి జగన్నాధ రావు మాట్లాడుతూ తమ ఆఫీసులో అకౌంటెంట్ మరియు తరువాత ద్వారా ఫైనాన్స్ డిపార్ట్మెంట్‌కు ప్రతి బాధితుడికి స్పెషల్ అకౌంట్ నెంబర్ క్రియేట్ చేసి పంపుతామన్నారు. ఫైనాన్స్ డిపార్ట్మెంట్ వారు క్లియరెన్స్ కాగానే బాధితుల అకౌంట్ లో రిలీఫండ్స్ పడతాయి అన్నారు. డిస్టిక్ ట్రెజరీ అధికారిని కలిసిన వారిలో నీలం నాగేందర్‌రావుతో పాటు మాల మహానాడు నాయకులు దార అంజయ్య, కాకుమాను రవి,మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ పత్రా బంగారం, మాలసభ కన్వీనర్ మేడికొండ మురళి, యానాది పరిరక్షణ సమితి కన్వీనర్ కోలా జీవరత్నం తదితరులు ఉన్నారు.









# మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### జిల్లా మలేరియా అధికారి ఎన్ మధుసూదన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)

జిల్లా కలెక్టర్ పి రాజబాబు ఆదేశాల ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు మలేరియా వ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక భాగ్యనగర్ సాంఘిక సంక్షేమ మహిళా కళాశాల హాస్టల్ నందు మలేరియా వ్యతిరేక మాసో త్సవాలలో భాగంగా హాస్టల్ నందు దోమ నివారణకు ఐదు శాతం ఏసీఎం క్రిమిసంహారిని పిచికారి చేశారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి ఎన్ మధుసూదనరావు మాట్లాడుతూ మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అను పరాన్న జీవి ద్వారా ఆడ ఎనాఫిలిస్ దోమకాటు వలన ప్రజలకు వస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన కారణంగా పరిస్థితులు దోమల పెరుగుదలకు అనుకూలంగా ఉంటాయని తద్వారా కీటక జనిత వ్యాధులైన మలేరియా డెంగ్యూ చికెన్ గునియా వంటి పలు వ్యాధులు సమాజంలో ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కావున దోమల వ్యాప్తిని అరికట్టే నిమిత్తం ముందు జాగ్రత్త చర్యగా 5% ఏసీఎం క్రిమి సంహారిని ఉపయోగించి ఇండోర్ రేసిడ్యూయల్ స్ప్రేయింగ్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. దోమలను నివారించే నిమిత్తం ప్రజలు ఎప్పటికప్పుడు నీటి నిల్వలను శుభ్రం చేసి వాటి పై మూతలు పెట్టడం, దోమతెరలు వాడటం, కూలర్లు, టైర్లలో నీరు నిలవకుండా చేయడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టి కీటక జనిత వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్రైడే డ్రైడే, ర్యాలీ కార్యక్రమాలలో సిబ్బందితో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, సిబ్బందితో పాటు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు పాతూరి శ్రీనివాసులు, ఇండ్ల సాగర్, సూపర్వైజర్ రాఘవేంద్రరావు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, మలేరియా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.










# ప్రైవేట్ పాఠశాలలు నోట్ పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తే చర్యలు

### ఎంఈవో పున్నయ్య హెచ్చరిక

(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, జూన్ 12)

మండలంలోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తే విద్యాహక్కు చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖ అధికారి పున్నయ్య హెచ్చరించారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు తరగతుల వారీగా ఫీజుల వివరాలను పాఠశాల ప్రాంగణంలోని నోటీసు బోర్డులో తల్లిదండ్రులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యాలు నిర్ణయించిన ఫీజులకు మించి వసూలు చేసినట్లయితే తల్లిదండ్రులు వెంటనే విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా పాఠశాలలు నిబంధనల మేరకు వ్యవహరించాలని ఎంఈవో పున్నయ్య సూచించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# 400 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం... మాతో రండి చూపిస్తాం



- ▶వైసీపీ ఇంచార్జ్ బుర్రాకు కూటమి నేతల సవాల్
- ▶పట్టణంలో జరుగుతున్న పనులు మీ కళ్ళకు కనిపించడం లేదా ?
- ▶గ్రామాల్లో ఏ పనులు జరుగుతున్నాయో మీ నేతలను అడిగి తెలుసుకో
- ▶దండిగా దోచుకున్నావు కాబట్టే.. కనిగిరి నుంచి తరిమేశారు
- ▶నీ కథలను... బుర్ర కథలుగా ఇప్పటికీ చెప్పుకుంటున్నారు
- ▶కందుకూరులో నీ పప్పులు ఉడకవ్
- ▶మా ఎమ్మెల్యే నాగేశ్వరరావు పై అతిగా మాట్లాడొద్దు
- ▶తల్లిని, చెల్లిని తరిమేసిన జగనే పెద్ద వెన్నుపోటు దారుడు
- ▶ 2029 ఎన్నికల్లో గొడ్డలిపార్టీ దుకాణం మూసుకోక తప్పదు
- ▶కందుకూరులో కూటమి పార్టీల విజయోత్సవ ర్యాలీ
- ▶భారీగా తరలివచ్చిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల శ్రేణులు
- ▶రెండేళ్ల విజయాలను వివరించిన నేతలు







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 12)**

కందుకూరు నియోజకవర్గ చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా 400 కోట్ల రూపాయలతో జరుగుతున్న భారీ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు కళ్ళారా ఒక పక్క చూస్తుంటే వైసిపి ఇన్చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్, ఆ పార్టీ నేతలు కడుపుమంటతో రగిలిపోతున్నారని తెలుగుదేశం పార్టీ నేతలు ఘాటుగా విమర్శించారు. కళ్ళుండి చూడలేని వారంతా, తమతో వస్తే ఒక్కొక్క పనిని దగ్గరండి చూపిస్తామని, అందుకు బుర్రా సిద్ధమేనా అని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో కందుకూరు పట్టణంలో శుక్రవారం భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తొలుత నేతలంతా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పోస్ట్ ఆఫీస్ సెంటర్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు, ముఖ్యంగా మహిళలతో సహ ప్రజలు కూడా పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి సంఘీభావం తెలిపారు. చివరగా అంబేద్కర్ విగ్రహం వద్ద నేతలు మీడియాతో మాట్లాడుతూ... కనిగిరిలో అందినకాడికి దోచుకుని ప్రజలను ముంచాడు కాబట్టే బుర్రాను కందుకూరుకు పంపించారని విమర్శించారు. కనిగిరి పల్లెల్లో బుర్రా కథలను బుర్రకథలుగా ఇప్పటికీ చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పచ్చకామెర్ల రోగిలాగా, మధుసూదన్ యాదవ్ కళ్ళకు అంతా అవినీతిగా కనిపిస్తోందని విమర్శించారు. మాది డబ్బా ప్రచారం కాదని, అభివృద్ధి చేశాం కాబట్టే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్ళగలుగుతున్నామని అన్నారు. కందుకూరు పట్టణం, గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి మీ పక్కనే ఉండే నేతలను అడిగి తెలుసుకోవాలని హితవు పలికారు. డివైడర్, నాలుగు లైట్లు వేసి అభివృద్ధిగా చెప్పుకుంటున్నారని బుర్రా చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేతలు విరుచుకుపడ్డారు. రోడ్ల వెడల్పు, సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, చెరువులు, కుంటల అభివృద్ధి, వేలమందికి సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు, గోకులం షెడ్లు, గర్భకండ్రిక భూముల సమస్యకు పరిష్కారం, సముద్ర తీరంలో జెట్టి నిర్మాణం, బిపిసిఎల్, ఇండోసోల్ కంపెనీలు, రాళ్లపాడు ప్రాజెక్టు అభివృద్ధి, కందుకూరు చుట్టుపక్కల పది కిలోమీటర్ల దూరం వరకు రామతీర్థం తాగునీటి సరఫరా, మురికి నీటిని వాడుకనీటిగా మార్చే ప్లాంట్, గ్రామాలకు లింకు రోడ్లు, నూతన తారురోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం.... ఈ పనులన్నీ అభివృద్ధిలో భాగంకాదా అని ప్రశ్నించారు. గడచిన ఐదేళ్ల వైసిపి పాలనలో ఇవన్నీ ఎందుకు చేయలేకపోయారో చెప్పాలన్నారు. ఒక్కఛాన్స్ అని ప్రజలను నమ్మించి, వారిని నానాహింసలు పెట్టి, ఇప్పుడు జనం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మరోసారి తమ ఎమ్మెల్యే గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని బుర్రాను ఘాటుగా హెచ్చరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు 90 శాతం అమలు జరుగుతున్నాయని నేతలు పేర్కొన్నారు. జగన్ హయాంలో వెళ్లగొట్టిన, పారిపోయిన పరిశ్రమలే కాకుండా ఇంకా అనేక కంపెనీలను చంద్రబాబు గారు మళ్ళీ రాష్ట్రానికి తీసుకువచ్చారని అన్నారు. అమరావతిని అత్యద్భుతంగా తీర్చిదిద్దటం, పోలవరం ప్రాజెక్టు పనులను పరుగులు తీయించడం, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను రాష్ట్రానికి తీసుకురావడం, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం, అన్న క్యాంటీన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ల మొత్తాన్ని పెంచి ఇవ్వడం, ప్రతిఇంట్లో చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం ఇలాంటివన్నీ అనుభవజ్ఞుడైన చంద్రబాబు వల్లే సాధ్యపడుతున్నాయని అన్నారు. ఇక వెన్నుపోటు అనే పదం, వైసీపీకి పేటెంట్ గా చెప్పుకోవచ్చని, ఆస్తుల కోసం తల్లిని, చెల్లిని తరిమివేయడాన్ని వెన్నుపోటు కాక ఇంకేమి అంటారని కూటమి నేతలు ప్రశ్నించారు. 2029 ఎన్నికల్లో కూడా మధుసూదన్‌కు ఓటమి తప్పదని, ఆ పార్టీ దుకాణం కూడా మూతపడటం ఖాయమని నేతలు విమర్శించారు.

ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, జనసేన నాయకులు కళ్యాణ్, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీను, పట్టణ నాయకులు కంద్రా మాల్యాద్రి, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీను, నార్నె రోశయ్య, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, ఏపీఈడబ్ల్యూఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, పార్టీ నాయకులు ముచ్చు శ్రీను, మోదడుగు వెంకటేశ్వర్లు, షేక్ మున్నా, అల్లం వెంకటేశ్వర్లు, పొడపాటి మహేష్, కల్లూరి శైలజ, ముచ్చు లక్ష్మీరాజ్యం, షేక్ రఫీ, రాయపాటి శ్రీను, రెబ్బవరపు మాల్యాద్రి, వడ్డేళ్ల రవిచంద్ర, కూనం నరేంద్ర, నాదెండ్ల వెంకట రమణయ్య, మహిళా నేతలు అశ్విని, అల్లం సుమతి, మన్నం శైలజ, గ్రామ, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషన్ సభ్యులకు ఘన సత్కారం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 12)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ నూతన సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజ్, మేకల బిక్షం (దాస్)లకు పొదిలిలో ఘన సత్కారం లంభించింది. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్, సురేఖ దంపతుల నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తేనేటి విందు కార్యక్రమానికి వీరిద్దరూ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరికుంట్ల అనిల్, సురేఖ దంపతులతో పాటు కుంచేపల్లి మాజీ సర్పంచ్ వరికుంట్ల కాంతమ్మ, వరికుంట్ల డేవిడ్, వరికుంట్ల నిరంజన్ కమిషన్ సభ్యులను శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. సమాజంలో ఎస్సీల హక్కులను కాపాడటంలో, వారి సంక్షేమానికి అండగా నిలవడంలో నూతన సభ్యులు కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ సత్కార కార్యక్రమంలో గొట్లగట్టు మాజీ సర్పంచ్ పెరికె సుఖదేవ్ (బూన్), నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు గిద్దలూరి శ్రీకాంత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రోళ్ళ శ్రీను, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన బాధితులకు అండగా జనసేన నేత జహీర్

### సమస్యను ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లిన వైనం పొతవరంలో క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎస్సీ కమిషన్ సభ్యులు







**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 12)**

మండలంలోని పొతవరం గ్రామంలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన స్మశాన స్థల వివాదం ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చింది. స్థానిక జనసేన నాయకుడు హల్ చల్ జహీర్ చొరవతో రాష్ట్ర ఎస్సీ కమిషన్, అధికార యంత్రాంగం కదిలి వచ్చారు. జనసేన నేత జహీర్ విజ్ఞప్తి పై తక్షణమే స్పందించిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు పాకనాటి గౌతమ్ రాజ్, మేకల బిక్షం దాస్ శుక్రవారం పొతవరం గ్రామంలో స్వయంగా పర్యటించారు. వివాదాస్పద స్మశాన స్థలాన్ని, అక్కడ ఉన్న సమాధులను, శిథిలాలను, బోర్డులను అధికార యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. బాధితుల నుంచి సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ సామాజికవర్గానికి ఎక్కడ అన్యాయం జరిగినా కమిషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. బాధితులను తక్షణమే ఆదుకోవడమే తమ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ వివాదంపై స్థానిక అధికారుల నుంచి పూర్తి సమాచారాన్ని, రికార్డులను సేకరించామని, స్మశాన స్థల ఆక్రమణదారుల పై కఠిన చర్యల కోసం ప్రభుత్వానికి త్వరలోనే నివేదిక సమర్పిస్తామని వారు వెల్లడించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సున్నితమైన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి, అధికార యంత్రాంగాన్ని కదిలించిన జనసేన నాయకుడు జహీర్‌కు పొతవరం గ్రామ ప్రజలు, పలువురు సామాజిక నేతలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# కూటమి పాలన వెన్నుపోటుకు రెండేళ్లు బద్వేలులో వైసీపీ భారీ నిరసన ర్యాలీ

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 12)**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు బద్వేలు నియోజకవర్గశీలో కూటమి పాలన వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం శనివారం బద్వేలు లొ ఘనంగా జరిగింది. ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యరెడ్డిల సంయుక్త ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు భారీ నిరసన ర్యాలీని సిద్ధవటంలో ఎన్జీవో కాలనీ వద్ద నుండి 4, కూడళ్ల గుండా ఆర్డీవో కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో వైసిపి కార్యకర్తలు, నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ముఖ్య నేతలు ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్య రెడ్డిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారి మాటల్లో భారతదేశంలోనే గాక ప్రపంచంలోనే అబద్ధాలు చెప్పే ముఖ్యమంత్రి ఎవరన్నా ఉన్నారంటే అది చంద్రబాబే. ఎన్నికల ముందు ప్రజలకు అమలు చేయలేని హామీలు ఇచ్చి, నమ్మించి ఘోరంగా మోసగించారు. అధికారం చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా ఏ ఒక్క హామీనైనా సక్రమంగా అమలు చేశారా? అని ప్రశ్నించారు.



**మహిళలకు మోసం :**

ఆడబిడ్డ నిధి పథకాన్ని సక్రమంగా అమలు చేస్తే బడ్జెట్ చాలదని కూటమి మంత్రులే స్వయంగా చెబుతున్నారని మండిపడ్డారు. ప్రతి మహిళకు ఈ రెండేళ్ల కాలంలో ప్రభుత్వం రూ. 36,000 బాకీ పడిందని, హామీలు నెరవేర్చకుండా రెండేళ్లు పూర్తయిందని సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.

**నిరుద్యోగులు, రైతుల వంచన :**

నిరుద్యోగ భృతి ఇస్తామని యువతను మోసం చేశారని, మహిళలు, నిరుద్యోగులు, రైతులు ఇలా ప్రతి ఒక్కరినీ ఈ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు.

**కక్షసాధింపు రాజకీయాలు :**

ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే ప్రజాస్వామ్యబద్ధంగా సమాధానం చెప్పాల్సింది పోయి, వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఎన్టీఆర్ ఆశయాలను తుంగలో తొక్కారు :**

మహానుభావుడు ఎన్టీ రామారావు పేద ప్రజల కోసం పార్టీ స్థాపించి ప్రతి ఇంటికి 'రోటీ, కపుడా, మఖాన్", జనతా వస్త్రాలు అందించారని గుర్తు చేశారు. కానీ నేడు చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ మూల ఆశయాలను పూర్తిగా తుంగలో తొక్కారని విమర్శించారు. కేవలం వెన్నుపోటు రాజకీయాలతో గద్దెనెక్కి విగ్రహాలు పెట్టుకుంటున్నారు తప్ప, పేదలకు పథకాలు అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. రాబోవు స్థానిక ఎన్నికలలో కూడా ప్రజలందరూ పార్టీ బలేపెతానికి కృషి చేయాలన్నారు, ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి నియోజకవర్గం బూత్ కన్వీనర్ల ఇంచార్జ్ రమణారెడ్డి బంగారు సీనయ్య సుందర రామిరెడ్డి గుర్రంపాటి రమణారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, సాయికృష్ణ గానుగపెంట రమేష్ బాబు, జడ్పిటిసి పోలిరెడ్డి, పెద్ద పోలిరెడ్డి, తుమ్మిశెట్టి శ్రీనివాసులు, అనిల్ కుమార్ రాజు, ఉమా, బిజ్జం రమణయ్య సుబ్బరాజా, చెన్న కృష్ణారెడ్డి, ఈగ యద్దారెడ్డి, పుత్త శ్రీరాములు, బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ చైర్మన్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, వివిధ విభాగాల నాయకులు, భారీ సంఖ్యలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే, రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.



